'మే'లో ఇండో - మలేషియా అంతర్జాతీయ వాణిజ్య సదస్సు



సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: ఇండో – మలేషియా అంతర్జాతీయ వాణిజ్య సదస్సు, ఫ్యాషన్ కార్నివాల్ అవార్డుల ప్రదానోత్సవం–2025 వేడుకలను మే నెలలో కౌలాలంపూర్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల నుంచి మిస్, మిస్టర్స్, స్టార్ యూనివర్స్ ఈ ఫ్యాషన్ కార్నివాల్‌లో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించనున్నారని తెలిపారు. బెస్ట్ ఫ్యాషన్ బ్యూటీ, డిజైనర్స్, మోడల్స్, మేకప్ ఆర్టిస్ట్‌కు అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుధా, డాక్టర్ రాజీవ్, వినయ్‌రెడ్డి, నర్మద తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకరంజకం క్లాసికల్ డాన్స్ ఫెస్టివల్



కళాకారులతో లంకా లక్ష్మీనారాయణ, మహ్మద్ రఫీ, మృణాళిని తదితరులు

చిక్కడపల్లి: కథక్ కళా క్షేత్ర ఆధ్వర్యంలో ఇండియన్ క్లాసికల్ డాన్స్ ఫెస్టివల్–2025 శుక్రవారం త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధమాన కళాకారుల కథక్, భరతనాట్య ప్రదర్శన ప్రేక్షకరంజకంగా సాగింది. ఈ కార్యక్రమంలో యువ కళా వాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, ప్రముఖులు, గురువులు మహ్మద్ రఫీ, మృణాళిని, సాయివేదాంత, పండిట్ అంజిబాబు, లాస్య, గౌతమి, గురురాజ్, మేధాన్ష్, మోక్షిత్, నర్సింహారావు, నిర్మల ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎఫ్‌సీఎస్ పీటర్‌కు నివాళి

చిక్కడపల్లి: హెబ్రోన్ చర్చిలో ట్రస్ట్ ఫౌండర్ ఎఫ్‌సీఎస్ పీటర్ భౌతికకాయానికి శుక్రవారం క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరుషలేం మత్తయ్య నివాళి అర్పించారు. అనంతరం ఎఫ్‌సీఎస్ పీటర్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఇజ్రాయిల్ పోచయ్య, బ్రదర్ ఆనంద్, బ్రదర్ బాలరాజ్ బ్రదర్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఇందిరా క్రికెట్ టోర్నమెంట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 17న నుంచి ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించనున్నారు. శుక్రవారం టోర్నీకి సంబంధించిన పోస్టర్‌ను ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆవిష్కరించారు. ఓయూతో పాటు నిజాం కాలేజీ, సికింద్రాబాద్ పీజీ, సైఫాబాద్ పీజీ కాలేజీలలో పోటీలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి , ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్లు వంశిరెడ్డి, వికాస్‌యాదవ్, ఉపాధ్యక్షులు వెంకట్ ముదిరాజ్ పాల్గొన్నారు.

రంగ్ బర్సే..!

అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ పరిధిలోని శుక్రవారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. పిల్లలు, పెద్దలు, యువతీ యువకులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు రంగుల దోలికల్లో మునిగితేలారు. కుల, మత, ప్రాంత, లింగ బేధం లేకుండా ఒకరిపై ఒకరు గులాల్ (రంగులు) చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

– అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్



బీజేపీ అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి రంగులు పూస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ



హోలీ వేడుకలను ఉద్దేశించి మాట్లాడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



ఇందిరాపార్కులో జరిగిన హోలీ వేడుకల్లో జి.రచనశ్రీ, బండారు విజయలక్ష్మి, నేతలు



హిమాయత్‌నగర్‌లో జరిగిన హోలీ వేడుకల్లో బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధానకార్యదర్శి కేశబోయిన శ్రీధర్



జెమినీకాలనీలో కుటుంబీకులతో కలిసి హోలీ వేడుకల్లో ఓబీసీ మోర్చా జాతీయ నేత పూస రాజు



హోలీ వేడుకల్లో కాంగ్రెస్ సీనియర్ నేతలు



వేడుకల్లో గోల్నాక కార్పొరేటర్ లావణ్య శ్రీనివాస్‌గౌడ్



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి పద్మ



రాంనగర్‌లో చిన్నారులతో బీఆర్ఎస్ నాయకుడు నాగేష్‌ముదిరాజ్







బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో హోలీ వేడుకల్లో వాకర్స్ సభ్యులు



కాచిగూడలో జరిగిన హోలీ వేడుకల్లో భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు



నల్లకుంట గ్రీన్ రిచ్ రెసిడెన్సీ వద్ద హోలీ సంబరాల్లో చిన్నారులు



వేడుకల్లో అంబర్‌పేట కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్



స్నేహితులతో కలిసి హోలీ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు శివముదిరాజ్





రాంనగర్‌లో ప్రొ. కోదండరామ్‌కు రంగులు పూస్తున్న చిన్నారి, ఎం.నర్సయ్య



పారిశుధ్య కార్మికులతో హోలీ వేడుకలు జరుపుకున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావని దంపతులు

తల్లీ నీకు వందనం

- బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందిన బెల్లం సుధాకర్
- మృతి చెందిన కొడుకు అవయవాలను దానం చేసిన తల్లి



ముషీరాబాద్: అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన తన కుమారుడి అవయవాలను ఓ తల్లి దానం చేసి ఆదర్శంగా నిలిచింది. రాంనగర్‌కు చెందిన బెల్లం సుధాకర్(40) బ్రెయిన్ స్ట్రోక్‌తో హైదర్‌గూడలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. అవయవదానంతో ఎంతో మంది కొత్త జీవనం పొందుతున్నారని వివిధ మాధ్యమాల ద్వారా ఆమె తెలుసుకున్నారు. తన కుమారుడి అవయవాలను దానం చేయాలని నిర్ణయించుకున్నారు. మృతుడి తల్లి బెల్లం సరోజను పలువురు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

ముగిసిన చండీ పారాయణము

నల్లకుంట: పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం నల్లకుంటలోని శ్రీశృంగేరి శంకరమఠం భక్తులతో పోటెత్తింది. ఉదయం 8గంటలకు యజుర్వేద పారాయణం జరిగింది. శ్రీవిధుశేఖర భారతీ సన్నిధానం జన్మనక్షత్రం(ఉత్తర) పురస్కరించుకొని ఈనెల 7వ తేదీన ప్రారంభమైన చండీ పారాయణం శుక్రవారంతో ముగిసింది. ముందుగా మఠం ప్రాంగణంలోని శక్తి గణపతికి ఆది పూజలు చేశారు. అనంతరం చంద్రమౌళీశ్వర స్వామి విశేష పూజలు అందుకున్నారు. అలాగే లోకమాత శారదాంబకు లక్ష కుంకుమార్చన చేశారు. అదే విధంగా మఠం ప్రాంగణంలోని యాగశాలలో పండితులు శ్రీనివాసశర్మ మంత్రోచ్చారణల నడుమ చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవ దాన్యాలు, కొబ్బరి కాయలు, సుగంధ ద్రవ్యాలు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి కావించారు. భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వెండి రథసేవ నిర్వహించారు. శనివారం(నేడు) ఉదయం 9 గంటలకు యజుర్వేద పారాయణం ఉంటుందని మఠం ధర్మాధికారి చింతలపాటి శ్రీనివాస మూర్తి తెలిపారు. ఈ పూజలో మఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ గోరుగంతు రవి పాల్గొన్నారు.



శారదాంబకు కుంకుమార్చన చేస్తున్న అర్చకులు

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ప్రసిద్ధి చెందిన శ్రీఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు, తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జానకీసుధాకర్, ఈవో ఎం.దేవనాథం, భక్తులు, అర్చకులు బుగ్గ లక్ష్మీపతి శర్మ, కందాళ వెంకటాద్రి భక్తులు తదితరులు పాల్గొన్నారు.



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న అర్చకులు, భక్తులు



శంకరమఠం యాగశాలలో చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

యువజనోత్సవాలు ప్రారంభం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ యువజనోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను శాస్త్రవేత్త, సామాజిక కార్యకర్త కృష్ణప్రసాద్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోటీలను ఓయూ ఏసీపీ జగన్ ప్రారంభించారు.

బీఆర్ఎస్వీ నాయకుల ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇఫ్లూ రోడ్డులో ధర్నా చేశారు. తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ధర్నా చేపట్టి, ఓయూ పీఎస్‌లో సీఎం రేవంత్ రెడ్డి పై ఫిర్యాదు చేసినట్లు బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ట్రాఫిక్ జామ్ కావడంతో బీఆర్ఎస్వీ నాయకులను అరెస్ట్ చేసి లాలాగూడ పీఎస్‌కు తరలించారు. బీఆర్ఎస్వీ నేతలు కిరణ్‌గౌడ్, వెంకట్, దశరథ్, జంగయ్య, రమేష్‌గౌడ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల వేలాన్ని వెంటనే నిలిపేయాలి

బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ అధ్యక్షుడు వేముల రామకృష్ణ

కాచిగూడ: ప్రభుత్వ భూముల వేలం అమ్మకాలను ప్రభుత్వం వెంటనే నిలిపి వేయాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారికి లేఖలు రాశారు. ప్రభుత్వ భూముల్లో సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్స్, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో అరకొర వసతులతో విద్యార్థులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. అద్దె భవనాలకు మూడు సంవత్సరాల నుంచి ప్రభుత్వం అద్దెలు చెల్లింకపోవడంతో భవనాల యజమానులు ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు, మెస్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

- పెండింగ్‌లో ఉన్న రూ.7.5 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కాలేజీల యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు చదుకునే సమయంలో రోజువారి కూలీ పనులకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది విద్యార్థుల బంగారు భవిష్యత్‌పై పెను ప్రమాదం చేసే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కాంట్రాక్టర్లపై, భూ వ్యాపారులపై ఉన్న ప్రేమ విద్యార్థుల ఫీజులు చెల్లిండంలో మాత్రం చూపించడం లేదన్నారు. లిక్కర్ శాఖకు మంత్రి ఉంటాడు కానీ, విద్యాశాఖకు మంత్రి మాత్రం ఉండరన్నారు. ఇది రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విద్య పట్ల ఉన్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అన్నారు.

అక్రమంగా మద్యం విక్రయాలు

పలువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు



చిక్కడపల్లి పోలీసుల అదుపులో నిందితులు

చిక్కడపల్లి: ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసిన సంఘటన చిక్కడపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. హోలీ పండుగల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్యం షాపులను మూసేయాలని స్పష్టమైన ఆదేశాలున్నా కూడా కొంతమంది బ్లాక్‌లో మద్యాన్ని విక్రయించారు. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు బాగ్‌లింగంపల్లిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న అంబర్‌పేటకు చెందిన జావీద్‌ఖాన్ అచ్చయ్యనగర్‌కు చెందిన సయ్యద్ సాజిద్, బాగ్‌లింగంపల్లికి చెందిన కుమ్మరి శివకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేశామన్నారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం

కాచిగూడ: హోలీ పండుగను దృష్టిలో ఉంచుకుని అన్ని వైన్ షాపులు శుక్రవారం మూసివేశారు. కాచిగూడ శాస్త్రీనగర్‌కు చెందిన రాజోలు శ్యామ్‌శంకర్ (35) తన ఇంటి వద్ద అక్రమంగా మద్యం విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. దీంతో కాచిగూడ పోలీసులు అతని వద్ద నుంచి 10 బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.